క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి

జామి: మండలంలోని భీమసింగి వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు వర ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారిని అభిషేకాలు చేసి పూలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈగా సంతోష్‌కుమార్

బొండపల్లి: మండల ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈగా ఎస్.సంతోష్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా పాడేరు మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇదివరకు ఇక్కడ పని చేసిన సునీల్ గంట్యాడ మండలానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సంతోష్‌కుమార్ మాట్లాడుతూ వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

నేడు మజ్జిగౌరమ్మ, భద్రకాళి జాతర

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం సంతలో ఉన్న మజ్జిగౌరమ్మ, భద్రకాళి అమ్మవార్ల ఆలయం వద్ద ఆదివారం జాతర నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి శనివారం తెలిపారు. అర్చకులు శ్రీనివాసశర్మ, వెంకటరమణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవార్లకు తెల్లవారు జాము నుంచి పూజలు, అభిషేకాలు చేయనున్నట్లు చెప్పారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

గజపతినగరం రూరల్: మండలంలోని గంగచోళ్లపెంట గ్రామంలో మరుపల్లి పశువైద్యశాల డాక్టర్ రమణ ఆధ్వర్యంలో పశువులకు శనివారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధి సోకితే పాల ఉత్పత్తి తగ్గిపోతుందని చెప్పారు. ప్రభుత్వం ఉచితంగా టీకాలు వేయిస్తోందని, పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు. సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్, తదితరసిబ్బంది పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా వ్యాక్సిన్లు వేయాలి



జామిలో వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డీటీసీఓ రామేశ్వరి

జామి: గర్భిణులు, చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ రామేశ్వరి వైద్య సిబ్బందికి సూచించారు జామి పీహెచ్‌సీ పరిధిలో ఎం.వి.కల్లాలు, జామిలో పీహెచ్‌సీ సిబ్బంది శనివారం చేపట్టిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ టీకాలను గర్భిణీ, చిన్నారులకు సకాలంలో అందించాలన్నారు. గర్భిణులకు తరచూ రక్తహీనత, తదితర వైద్య పరీక్షలు చేసి, హైరిస్క్ గర్భిణులను గుర్తించాలన్నారు. ఆశ నోడల్ అధికారి, డీపీహెచ్‌ఎన్‌ఓ వసంతలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ అనిల్‌ప్రేమ్‌కుమార్, సూపర్ వైజర్లు భవానీ, సత్యనారాయణ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ముస్లింలకు నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న స్థానిక పెద్దలు, మోసెస్ సంస్థ సభ్యులు

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామంలో బొద్దాం, కొత్తబొద్దాం తదితర గ్రామాలకు చెందిన 200 ముస్లిం కుటుంబాలకు విశాఖపట్నానికి చెందిన మోసెస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సుమారు రూ.80 వేల విలువైన సరుకులు పంపిణీ చేశామని ఆ సంస్థ సభ్యులు తెలిపారు. ఏటా రంజాన్ మాసం ప్రారంభంలో పేద ముస్లిం కుటుంబాలకు తమ సొసైటీ నిత్యావసర సరుకులు అందజేస్తూ వస్తోందని పేర్కొన్నారు. గ్రామపెద్ద ఎర్రా సన్యాసిరావు, వైస్ సర్పంచ్ ఎస్.వెంకటరమణ పాల్గొన్నారు.

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

- సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థన

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ఆ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో ప్రచారం చేశారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను పట్టభద్ర ఓటర్లకు వివరించి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. శృంగవరపుకోట మండలం శివరామరాజుపేట గ్రామంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎస్.కోట పట్టణంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పార్టీ నాయకులతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు.

– శృంగవరపుకోట, జామి, కొత్తవలస, గుర్ల, బొండపల్లి.



శృంగవరపుకోట: శివరామరాజుపేటలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, తదితరులు



శృంగవరపుకోట: ఎస్.కోటలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు



బొండపల్లి: గొట్లాంలో ప్రచారం చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ రమణ, తదితరులు



కొత్తవలస: తుమ్మికాపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు



జామి: జామిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



గుర్ల: పోలాయవలసలో ప్రచారం చేస్తున్న నాయకులు

రైలు టిక్కెట్లపై రాయితీని పునరుద్ధించాలి



ఎంపీ బెల్లానకు వినతిపత్రం అందజేస్తున్న సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు

చీపురుపల్లి: నిరుపేద సీనియర్ సిటిజన్స్‌కు రైలు టికెట్లపై రాయితీ పునరుద్ధరించేలా సామాజిక పింఛన్‌దారులకు ఉచితంగా ప్రయాణానికి అవకాశం కల్పించేలా చూడాలని జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను కోరారు. ఎంపీని పట్టణంలోని ఆయన నివాసంలో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే విశాఖ–వారణాశి ఎక్స్‌ప్రెస్ రైలును కొద్దిరోజులుగా నిలిపివేశారని, ఈ సర్వీసును పునరుద్ధరించేలా రైల్వేశాఖ ,కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని కోరారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు సీహెచ్.త్రినాథ్‌ప్రసాద్, జగన్నాథరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జీడి, మామిడి తోటలు దగ్ధం



ఇంగిలాపల్లిలో కాలిపోతున్న మామిడితోట

దత్తిరాజేరు: మండలంలోని గడసాం, ఇంగిలాపల్లిలో శనివారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో మామిడి, జీడిమామిడి తోటలు దగ్ధమయ్యాయని ఆ గ్రామాల సర్పంచ్‌లు గర్భాపు విజయలక్ష్మి, నేతేటి దీపిక తెలిపారు. గడసాంలో సుత్తి రామకృష్ణకు చెందిన 4 ఎకరాల మామిడి తోట, ఇంగిలాపల్లిలో డొంక రామకృష్ణ, అప్పారావు, సింహాచలం, రాములకు చెందిన సుమారు 15 ఎకరాల మామిడి,జీడిమామిడి తోటలు దగ్ధమయ్యాయి. గజపతినగరం అగ్నిమాపక, దత్తిరాజేరు రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బందికి సమాచారం అందించామని చెప్పారు.

కార్మికుల భద్రతే ప్రధానం

చీపురుపల్లిరూరల్(గరివిడి): పరిశ్రమల్లో కార్మికుల భద్రతే అత్యంత ప్రధానమని, యాజమాన్యాలు అందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి.వి.ఎస్.ఎస్.నారాయణ అన్నారు. గరివిడి ఫేకర్ పరిశ్రమలో జాతీయ భద్రతా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం యాజమాన్యం అన్ని సదుపాయాలను కల్పించాలన్నారు. యాజమాన్యం,కార్మికులు సమష్టి బాధ్యత తీసుకుంటే పరిశ్రమల్లో ఎలాంటి ప్రమాదాలు జరగవని అన్నారు.పరిశ్రమల్లో భద్రతా



మాట్లాడుతున్న డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ

నియమాలు తప్పనిసరిగా అమలు చేయాలన్నారు.ఫేకర్ సీఈ ఎం.ఎస్.ఎన్.శర్మ, భద్రతా అధికారి లక్కరాజు నారాయణమూర్తి, పూర్వపు జీఎం మూర్తి, కార్మిక సంఘాల నేతలు గౌరినాయుడు, కంది రామారావు తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్ విజయానికి సమష్టిగా కృషి చేయాలి



చీపురుపల్లి: మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, వేదికపై ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎంపీ చంద్రశేఖర్

చీపురుపల్లి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్ విజయానికి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సూచించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 13వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో పట్టభద్ర ఓటర్లంతా తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చూడాలన్నారు. చీపురుపల్లి నియోజకవర్గం నుంచి అధిక మెజార్టీ అందించి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచేలా చూద్దామని చెప్పారు. గ్రామాల్లో పట్టభద్ర ఓటర్లంతా ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు వచ్చేలా గ్రామ స్థాయి నాయకులు పనిచేయాలని సూచించారు.

అచ్చెంనాయుడు వ్యాఖ్యలు హాస్యాస్పదం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెంనాయుడు మాటలు విడ్డూరంగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేయకపోయినా పర్వాలేదు కాని వైఎస్సార్‌సీపీకి ఓటు వేయవద్దని ఆయన చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీకి సంస్థాగతమైన నిర్ణయాలు లేవని, కేవలం కుట్ర రాజకీయాలు చేయడం మాత్రమే తెలుసని ఎద్దేవా చేశారు. ఎల్లో మీడియా తప్పుడు కథనాలు, దుష్ప్రచారాలను నమ్మవద్దని ఓటర్లకు, ప్రజలకు సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, ఎస్.వి.రమణరాజు, ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, వంశీకృష్ణ, మీసాల విశ్వేశ్వరరావు, వాకాడ శ్రీనివాసరావు, కొణిశ కృష్ణంనాయుడు, సీర అప్పలనాయుడు, పొట్నూరి సన్యాసినాయుడు, తాడ్డి వేణు, బూర్లె నరేష్ పాల్గొన్నారు.



గజపతినగరం: నాయకులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

సుధాకర్‌ను గెలిపించండి

గజపతినగరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌ను అధిక మెజార్టీతో గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండల నాయకులు, కార్యకర్తలతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లోని పట్టభద్ర ఓటర్లంతా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేసేలా చూడాలని సూచించారు. జెడ్పీటీసీ గార తవుడు,పార్టీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ,నాయకులు బెల్లాన త్రినాథరావు, సురేష్, పల్లి సంజీవరావు, సామంతుల పైడిరాజు, రేగసురేష్, కర్రి రామునాయుడు పాల్గొన్నారు.

పాఠశాలల్లో డీఈఓ తనిఖీలు

జామి: మండలంలోని విజినిగిరి ఉన్నత పాఠశాల, కుమరాం కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో డీఈఓ లింగేశ్వరరెడ్డి శనివారం తనిఖీలు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రికార్డులను, తరగతి గదులు, వసతులను పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. విజినిగిరి పాఠశాలలో ఉపాధ్యాయులు,హెచ్‌ఎంపైన ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎల్‌ఐపీ ప్రోగ్రాన్ని మరింత మెరుగుపరచాలని సూచించారు. కుమరాం కేజీబీవీలో ఆయన మాట్లాడుతూ 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతతో సాధించేవిధంగా ఉపాధ్యాయ సిబ్బంది వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని చెప్పారు. గణితం, హిందీ, సోషల్ సబ్జెక్టులకు సంబంధించి గెస్ట్ టీచర్లను నియామించాలని ఎంఈఓ జె.జయశ్రీను ఆదేశించారు. పాఠశాలలను ఎప్పటికప్పుడు సందర్శించాలని ఎంఈఓకు సూచించారు.



విజినిగిరి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

ప్రైవేటు పాఠశాలల్లో పేద పిల్లలకు 25 శాతం సీట్లు

వేపాడ: ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరం నుంచి పేద పిల్లలకు ఒకటో తరగతిలో ఉచితంగా 25 శాతం సీట్లు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఎంఈఓ జి.శ్రీదేవి శనివారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాల్లోని పేద పిల్లలు, అనాథ పిల్లలు, దివ్యాంగు లు, హెచ్ఐవీ బారిన పడిన పిల్లలకు సీట్లు కేటాయించాల్సి ఉందన్నారు. బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు వార్షిక ఆదాయం రూ.1.20 లక్షలు మించి ఉండకూడదని చెప్పారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో మార్చి 18 నుంచి ఏప్రిల్ 4 వరకు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. పూర్తి వివరాలకు మండల విద్యా వనరుల కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

నవధాన్యాల సాగుతో జీవవైవిధ్యం

కొత్తవలస: నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని, భూమిలో జీవవైవిధ్యం ఏర్పడి పంటలకు కావాల్సిన పోషకాలు లభిస్తాయని సబల సంస్థ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూచించారు. తుమ్మికాపల్లి క్లస్టర్ పరిధి దేవాడ గ్రామంలో సబల సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ సహకారంతో నవధాన్యాల సాగుపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఎకరా పొలానికి 13 కిలోల నవధాన్యాలను చల్లాలని, 45 రోజుల తర్వాత చేను ఏపుగా పెరిగాక భూమిలో కలయ దున్నాలని సూచించారు. ఇలాచేయడం వల్ల భూమిలో కర్బన శాతం పెరుగుతుందని వివరించారు.

అధిక దిగుబడులు సాధ్యం

గజపతినగరం రూరల్: ఖరీఫ్ ప్రధాన పంట వేసే ముందు ఆయా పొలాల్లో నవధాన్యాలు సాగు చేస్తే భూసారం పెరిగి పంట దిగుబడి పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మండల అధికారి సత్యనారాయణ అన్నారు. 'నవధాన్యాలను సాగుచేద్దాం–నేలతల్లిని బాగుచేద్దాం' నినాదంతో మండలంలోని శ్రీరంగరాజపురం గ్రామంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నవధాన్యాల సాగుతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. సర్పంచ్ గిడిజాల కామునాయుడు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సత్యవతి, సంతోషి, గేదెల సత్తిరాజు, పత్తిగుళ్ల హేమ, జి.అప్పలనాయుడు పాల్గొన్నారు.



గజపతినగరం రూరల్: శ్రీరంగరాజపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ రేపే...

- పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్
- ఎస్.కోట నియోజకవర్గంలో పట్టభద్ర ఓటర్ల సంఖ్య - 9,574
- పోలింగ్ బూత్‌లు -12

శృంగవరపుకోట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలి రెండు పర్వాలు ముగిశాయి. అభ్యర్థుల ఎంపిక, ప్రకటన, నామినేషన్లు తొలి దశ కాగా, మలిదశలో అభ్యర్థులు, వారి మద్దతుదారులతో ప్రచార పర్వం జోరుగా సాగింది. శనివారంతో ప్రచార పర్వానికి తెర పడింది. ఇక అభ్యర్థుల భవితవ్యం పట్టభద్రుల చేతిలో ఉంది. పెద్దల సభకు ఎవరిని పంపుతారన్న అంశంపై అన్ని వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఎస్.కోట నియోజకవర్గ పరిధిలోని అయిదు మండలాల్లో 9,574 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది. కాగా వీరిలో ఎంతమంది ఓటు వేస్తారన్నది వేచి చూడాలి. వీరిలో 6,331 మంది పురుష ఓటర్లు కాగా, 3,243 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వీరంతా 12 పోలింగ్ బూతుల్లో ఓటు వేయనున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మాత్రమే ఓటింగ్ జరుగుతుంది. ఓటర్లు ఎపిక్ కార్డు లేదా భారత ప్రభుత్వం ఆమోదించిన ఫొటో ఉన్న 10 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా తీసుకుని రావాలి. గుర్తింపు కార్డు లేకుండా ఓటు వేసేందుకు అనుమతించరు.

ఇలా చేయాలి...

ఓటరు బూత్‌లో ఇచ్చిన ప్రత్యేక స్కెచ్‌పెన్‌తో మాత్రమే ఓటు వేయాలి. తొలి ప్రాధాన్యతగా 1వ అంకెను ఖచ్చితంగా వేయాలి. తొలి ప్రాధాన్యతగా 1 అంకె వేయకుంటే ఓటు చెల్లుబాటు కాదు. రోమన్ అంకెలను కూడా వాడవచ్చు. తర్వాత అభ్యర్థులకు తోచిన ప్రాధాన్యత ఇస్తూ వారి పేరుకు ఎదురుగా 2,3,4,5 అంకెలు వేయాలి.

ఇవి చేయకూడదు..

ఎస్.కోట నియోజకవర్గంలో ఓటర్లు, పోలింగ్ బూత్‌ల వివరాలు

మండలం	మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు	పోలింగ్ బూత్‌లు
ఎస్.కోట	2,535	1,662	873	4
వేపాడ	1,319	927	392	1
జామి	1,861	1,219	642	3
ఎల్.కోట	1,520	1,059	461	2
కొత్తవలస	2,339	1,464	875	2
మొత్తం	9574	6331	3243	12

తొలి ప్రాధాన్యతగా అంకె 1 ని ఒకరికి మించి వేయకూడదు. బ్యాలెట్ పత్రంపై ఎటువంటి రాతలు రాసినా, వేలిముద్రలు వేసినా ఓటు రద్దవుతుంది. అభ్యర్థుల ఎంపికను అంకెల్లో మాత్రం సూచించాలి. ఒకటి, రెండు అని లేదా ఇంగ్లిష్‌లో వన్, టూ, త్రీ అని రాయకూడదు. అభ్యర్థుల పేరు ఎదురుగా (✔) లేదా (✖) మార్కింగ్ చేయకూడదు. ఒక అభ్యర్థికి ఒకటి కన్నా ఎక్కువ అంకెలు సూచించకూడదు. మీరు వేసే అంకె గడిలో కాకుండా రెండు గడుల మధ్య ఉంటే ఓటును లెక్కించరు..



ఎస్.కోటలో పోలింగ్ బూత్ వద్ద ఏర్పాటు చేసిన టెంట్లు



వేపాడ పోలింగ్ బూత్ వద్ద ఓటు వినియోగంపై అవగాహన కల్పించేందుకు ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన అధికారులు

ఏర్పాట్లల్లో నిమగ్నం

బొండపల్లి: ఈనెల 13వ తేదీన నిర్వహించనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లలో రెవెన్యూ అధికారులు నిమగ్నమయ్యారు. గజపతినగరం నియోజకవర్గంలోని గజపతినగరం మండలంలో 1,641 మంది, దత్తిరాజేరులో 1,234, బొండపల్లిలో 1,230, గంట్యాడ మండలంలో 2,064 మంది ఓటర్లు ఉన్నారు. ఆయా మండల కేంద్రాల్లోని ఉన్నత పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేశారు. గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి హైస్కూళ్లలో రెండేసి బూత్‌లు, గంట్యాడలో మూడు బూత్‌లు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. కేంద్రాలకు 200 మీటర్ల పరిధి వరకు 144 సెక్షన్‌ను విధించి గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు.